క్లుప్తంగా

సర్పంచ్‌కు సన్మానం



జయకోడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు పొందిన గుడిపాల మండలం నంగమంగళం సర్పంచ్ జయకోడిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మానించారు. సెల్ఫ్ సఫిషియంట్ విభాగంలో అవార్డు వచ్చిందని సర్పంచ్ తెలిపారు.

గణనాథుని సేవలో కర్ణాటక హైకోర్టు సీజే



సీజేకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే మంగళవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఐరాల తహసీల్దార్ సుశీల, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

పేయదూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన శంకరజాతి దూడలు

గుడిపాల: మండలంలోని కోలాపూరు గ్రామంలో మంగళవారం శంకరజాతి పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్, డిప్యూటీ డైరెక్టర్ వాసు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేయదూడల్లో జెర్సీ జాతి ఆవులను అభివృద్ధి పరచడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఇక్కడ వాతావరణానికి జెర్సీ ఆవులు అనుకూలంగా ఉంటాయన్నారు. హెచ్ఎఫ్ ఆవులు వేసవిని సరిగ్గా తట్టుకోలేని పరిస్థితులు ఎదురవ్వడంతో పాటు పాలరేట్లు కూడా సరిగ్గా రావని తెలిపారు. అనంతరం 60 దూడలను ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో ఏడీ ఆసిఫ్, పశువైద్యులు శివరాజన్, చాణుక్య, రవితేజ, సాయిసుధ పాల్గొన్నారు.

పక్వానికి వచ్చాకే కాయలను కోయాలి

పూతలపట్టు: పక్వానికి వచ్చిన తర్వాతే మామిడి కాయలను కోయాలని రాష్ట్ర ఉద్యానవనశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని సంజీవరాయునిపల్లె రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. పక్వానికి వచ్చాక మామిడి కాయలను ఒకేసారి కాకుండా దశల వారిగా కోయడం వల్ల మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మామిడి కాయలను ప్లాస్టిక్ క్రేట్‌లలో నింపి రవాణా చేయాలన్నారు. ఆయన వెంట ఉద్యానవనశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, జయరాంరెడ్డి, కోటేశ్వరారావు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఐరాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరవేయాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులపై ఉందని డీఎల్‌డీఓ రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కామినాయనపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని రిజిస్టర్లు, మూమెంట్ రిజిస్టర్, సిబ్బంది హాజరు, స్పందన ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అలసత్వం వహించకుండా పరిశీలించి పరిష్కరించాలని కార్యదర్శులను ఆదేశించారు.

ఏనుగుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు వద్ద మంగళవారం రాత్రి ఏనుగుల దాడిలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పాలేరు గ్రామానికి చెందిన కీచనేరి రామచంద్రారెడ్డి కుమారుడు పద్మనాభరెడ్డి(43) వ్యవసాయ పొలం వద్ద లైటు వేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో పొలంలో ఉన్న ఏనుగులు పద్మనాభరెడ్డిపై దాడి చేసి తొండంతోతో కట్టాయి. తీవ్రంగా గాయపడిన పద్మనాభం ప్రాణభయంతో కష్టంపై గ్రామంలోకి చేరుకున్నాడు. ఏనుగులు దాడి చేసిన విషయాన్ని వివరించాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు అతన్ని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు.

దోమలను కట్టడి చేద్దాం.. మలేరియాను నివారిద్దాం

- ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీలో వైద్యులు
- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



చిత్తూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ అముద

చిత్తూరు రూరల్: దోమలను కట్టడి చేసి మలేరియా వ్యాధిని తరిమికొడదామని నగర మేయర్ అముద అన్నారు. చిత్తూరు నగరంలో మంగళవారం జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. మేయర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, నర్సింగ్ విద్యార్థులు గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రతిజ్ఞతో పాటు మానవహారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, వైద్య సేవల వల్ల జిల్లాలో ఏటా మలేరియా కేసులు రెండు మాత్రమే నమోదవుతున్నాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెడితే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ జి.ప్రకాశం, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు. డీపీఎంఓ శ్రీనివాసరావ్, ఎస్ఓ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైడే పాటించాలి

ఐరాల: మలేరియా వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ఈ వ్యాధిని నియంత్రించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మొరంపల్లె సచివాలయ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు.

పరిసరాల శుభ్రత అవసరం

గుడిపాల: పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారించి మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్‌లు సుకన్య, కుమార్ తెలిపారు. గుడిపాల పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత–దోమల నివారణపై అవగాహన కల్పించారు. హెల్త్‌సూపర్‌వైజర్లు హేమలత, విజయ, సీహెచ్ఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

యాదమరి: మండలంలోని యాదమరి, మాదిరెడ్డిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు శ్రీనివాస నాయక్, సీహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

పూతలపట్టు: మండల కేంద్రంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మలేరియాపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. వైద్యులు ప్రియంకా, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, శేషాద్రి, నూర్జహాన్, నీహారిక పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ఉండాలి

తవణంపల్లె: మలేరియా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి ధాత్రేయ చౌదరి అన్నారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీగా వెళ్లి టి.పుత్తూరు రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. వైద్యాధికారులు ప్రియంక, వినయ్‌కుమార్, సీహెచ్ఓ వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, హరి, అమరావతి పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

బంగారుపాళెం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని మండల వైద్యాధికారి లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా తగ్గువారిపల్లెలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్ల మధ్య మురుగు నీటి నిల్వలు, చెత్త దిబ్బలు లేకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ, బోధకాలు తదితర జబ్బులు దోమకాటు వల్ల వస్తాయని అన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



గుడిపాల: అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది



యాదమరిలో..



పూతలపట్టులో..



తవణంపల్లెలో మానవహారం



బంగారుపాళెం:తగ్గువారిపల్లెలో..

కోటికి చేరిన ప్రజామద్దతు



ప్రజామద్దతు కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ అముద

- చిత్తూరులో 70 వేల కుటుంబాల్లో సర్వే
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేలో కోటి కుటుంబాలు పాల్గొన్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 7న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సర్వే ఈనెల 30 వరకు కొనసాగుతుందన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 78,230 కుటుంబాలు ఉండగా అందులో 70 వేల కుటుంబాలు సర్వేలో పాల్గొన్ని తమ మద్దతును మిస్డ్ కాల్స్ ద్వారా తెలియజేశాయన్నారు. క్షేత్రస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు చురుగ్గా పాల్గొంటున్నారని అభినందించారు. వారందరి కృషితోనే ప్రస్తుతం సర్వేలో ముందంజలో ఉన్నామని తెలిపారు. మరో 4 రోజుల్లో మిగిలిన నివాసాలను కవర్‌చేసి ప్రథమ స్థానం రావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లలో జరిగిన మేలును ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని అన్నారు. చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, మేయర్ అముద మాట్లాడుతూ.. ప్రస్తుతం నియోజకవర్గంలో 90 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేస్తున్నా టీడీపీ నేతలు చెడుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, జిల్లా ప్రచార కార్యదర్శి రాజా, గుడిపాల మండలాధ్యక్షుడు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనం స్థలానికి ఫెన్సింగ్ వేయండి



డివైడర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు దుర్గానగర్ కాలనీలో నగరపాలక సంస్థ ఉద్యానవనం కోసం కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్ వేయాలని కార్పొరేషన్ కమిషనర్ జె అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్‌తో కలిసి దుర్గానగర్ కాలనీలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఉద్యానవనం కోసం కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా సత్వరం ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్థానికంగా డీబ్లాక్‌లో కల్వర్ట్, మేజర్ డ్రైన్లను పరిశీలించారు. జేసీబీ సాయంతో డ్రైన్లను శుభ్రం చేయించాలని ఆదేశించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాంధీ విగ్రహం కూడలి వద్ద పలమనేరు రోడ్డులో జరుగుతున్న డివైడర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు



ఆదిశంకరాచార్యుల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

బంగారుపాళెం: సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసిన జ్ఞానమూర్తి జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులని మొగిలి శివాలయం ప్రధాన అర్చకుడు రెడ్డెప్పగురుకుల్, అల్ ఇండియా పురోహిత సేన ప్రధాన సలహాదారు పాణ్యం శ్రీనివాసశర్మ అన్నారు. జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా మండలంలోని మొగిలి శివాలయంలో మంగళవారం జగద్గురు చిత్రపటాన్ని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాను స్థాపించిన వైదిక మార్గాన్ని కాపాడడానికి నాలుగు పీఠాలను స్థాపించారన్నారు. తూర్పున పూరి, దక్షిణంలో శృంగేరి, పశ్చిమాన ద్వారక, ఉత్తరంలో బద్రీ క్షేత్రంలో పీఠాలను నెలకొల్పారన్నారు. అద్వైత సిద్ధాంతమే మానవునికి పరమార్థమని చాటిచెప్పారన్నారు. ఆలయ ఈఓ మునిరాజ, ధర్మకర్త విజయకుమార్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న దయాసాగర్‌రెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: పెనుమూరులో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి గురువారం భూమి పూజ చేయనున్న టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ హేమలతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, దేవరాజులు రెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

యాదమరి: మండలంలోని ఎంఈవై కాలనీలో ఉన్న శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని గ్రామస్తులు తహసీల్దార్ చిట్టిబాబుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆక్రమించుకున్న వారికి నోటీసులు పంపారు. సంబంధిత భూమికి ఎమైనా రికార్డులు ఉంటే తీసుకురావాలని.. లేకుంటే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.

సామాజిక తనిఖీ నిర్వహించాలి



సమగ్ర శిక్ష సీఎంఓ గుణశేఖర్‌రెడ్డి

తవణంపల్లె: తల్లితండ్రుల కమిటీలతో పాఠశాలల్లో సామాజిక తనిఖీ నిర్వహించాలని సమగ్ర శిక్ష సీఎంఓ గుణశేఖర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తవణంపల్లె హైస్కూల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎంఓ గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమంపై సామిజిక తనిఖీ చేయడం వల్ల ఉపాధ్యాయుల్లో జవాబుదారితనం పెరుగుతుందన్నారు. సామాజిక తనిఖీతో పాఠశాల సమగ్ర అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుందన్నారు. సామాజిక తనిఖీలో తల్లితండ్రుల కమిటీతో పాటు ప్రజలను కూడా భాగస్వాములు చేయాలని హెచ్ఎంలకు సూచించారు. ఈ నెల 26వ తేదీ తల్లితండ్రులు, స్థానికులతో సామాజిక తనిఖీ చేసిన తర్వాత ప్రత్యేక ఆప్‌లో అప్‌లోడ్ చేయించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈఓ శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంసీ రోగుల సౌకర్యార్థం వసతి భవనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: చిత్తూరు సీఎంసీ ఆస్పత్రికి వచ్చే రోగులు బస చేసేందుకు నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. గుడిపాల మండలం ముట్టుకూరుపల్లె సమీపంలో మలంకారమార్ తోమ సిరియన్ చర్చ్ చెన్నై–బెంగళూరు డయాసిస్ ఈ భవనాన్ని నిర్మించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చీలాపల్లెలోని సీఎంసీ ఆస్పత్రికి వేలాది మంది రోగులు వస్తుంటారని తెలిపారు. వారు బస చేసేందుకు చిత్తూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని.. ఈ భవనం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాంధీ, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు శంభు, సాయి, వైద్యులు పాలీసన్, మక్కారియస్ హెపస్కోప్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఐరాల/గుడిపాల: మండలంలోని తిరుమలయ్యగారిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ 104 వైద్య శిబిరంలో 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేసుకున్న రోగులు ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి 15 రోజులకు ఓసారి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీహెచ్ఓ శివయ్య, ఎంపీహెచ్ఎస్ నాగరత్నమ్మ పాల్గొన్నారు. అలాగే గుడిపాల మండలం రాసనపల్లె వైఎస్సార్ క్లినిక్ భవనంలో 104 డాక్టర్ ప్రశాంతి గర్భిణిలు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. మందులను అందజేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



హెచ్ఎం శేఖర్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ రుక్మిణి

యాదమరి: మండలంలోని పెరియంబాడి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ రుక్మిణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకార్యలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాల హెచ్ఎం శేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



మంగళపల్లెలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మంగళపల్లె పంచాయతీ పరిధిలోని పామినివాండ్ల ఊరు, మంగళపల్లె, దళితవాడ, వెంకటాపురం, ఎస్టీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తూ..సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎస్టీకాలనీలో తాము నివాసముంటున్న గృహాలు వర్షానికి ఉరుస్తున్నాయాని, గృహాల మరమ్మతులు చేసుకునేందుకు సహకరించాలన్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పుడు డేట్ ఆఫ్ బర్త్ కారణంగా అర్హత కలిగిన వృద్ధులకు పింఛన్లు మంజూరు కావడంలేదన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ఆయా శాఖల అధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

విద్యార్థులకు చదువే బంగారు బాట వేస్తుందని, అందుకు కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే బాబు అన్నారు. మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాల స్థలాన్ని సర్వే చేయించాలని హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సర్వే చేయించాలని తహసీల్దార్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, హేమచంద్ర, ఎంపీటీసీలు శంకర్‌రెడ్డి, ఇందుశేఖర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ నారేసోమశేఖర్, ఎస్‌టీసీ జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లేడుపల్లె సర్పంచ్ భారతి, విష్ణురెడ్డి భానుప్రకాష్‌రెడ్డి, దొరస్వామి, ప్రభునాయుడు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లేడుపల్లెలో..

మండలంలోని జిల్లేడుపల్లెలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.